యస్మిన్‌స్థానే జపం కుర్యాద్ధరేచ్ఛక్రో స తత్ఫలమ్ ।
తన్మృదా లక్ష్మ కుర్వీత లలాటే తిలకాకృతిమ్ ॥

జపమును ముగించిన పిమ్మట, తాను కూర్చున్న ప్రదేశమునందలి మృత్తికను (మట్టిని) తీసికొని నుదుటిపై తిలకమువలె ధరించవలెను. లేనిచో జపఫలితమును ఇంద్రుడు గ్రహించివేయును.

## కరమాలతో జపించు పద్ధతి

ఆరభ్యానామికామధ్యం పర్వాణ్యుక్తాన్యమక్రమాత్ ।
తర్జనీమూలపర్యంతం జపేద్ దశసు పర్వసు ॥
మధ్యమాంగులిమూలే తు యత్పర్వ ద్వితయం భవేత్ ।
తద్వై మేరుం విజానీయాజ్జపే తం నాతిలంఘయేత్ ॥
(గాయత్రీకల్పం)




చిత్రము - 1




చిత్రము - 2

ఒకటవ చిత్రములో చూపినట్లు అనామిక - ఉంగరపు వ్రేలు మధ్య పర్వము (గణుపు) నందు సూచించిన ఒకటి (1) నుండి ప్రారంభించి వరుసగా (10) పదవ సంఖ్యవరకు బొటనవ్రేలి సహాయంతో జపించుటవలన ఒక కరమాల అగుతుంది. మధ్య (నడిమి) వ్రేలు మధ్య మరియు దిగువ

పర్వము (గణుపు)లు మేరువుగా చెప్పబడినందున, వాటిని దాటిపోరాదు. కావున తిరిగి విలోమముగా 10వ సంఖ్య నుండి ప్రారంభించి 1వ సంఖ్య వరకు జపించవలెను. జపమాలయొక్క మేరువూస వరకు లెక్కించి మేరువును దాటిపోకుండా తిరిగి వెనుకకు (త్రిప్పి) జపమాలపై లెక్కించినట్లుగనే చేతివ్రేళ్ళగణుపులకు చెప్పబడిన మేరువును దాటిపోకుండా వెనుకకు తిరిగి అనగా విలోమముగా లెక్కించవలెను. (1 నుండి 10వరకు మరల 10 నుండి 1 వరకు లెక్కింపుచు జపించవలెను.) ఈవిధంగా పదిమార్లు లెక్కించి జపించుటవలన జపసంఖ్య వంద అగును. తర్వాత రెండవ (2) చిత్రములో చూపబడినట్లుగా ఒకటి (1) నుండి ఆరంభించి (8) ఎనిమిదివరకు లెక్కించి జపించుట చేత ఎనిమిది (8) సంఖ్య అగును. వెరసి (108) ఒకవంద ఎనిమిది జపసంఖ్య పూర్తియగును. దేవమంత్రమును జపించుటకు ఈ పద్ధతిని అనుసరించవలెను.

## శక్తిమంత్రమును జపించుటకు వేరొక విధానము

పర్వద్వయమనామికాయాః కనిష్ఠాదిక్రమేణతు ।
తర్జనీమూల పర్యంతం కరమాలా ప్రకీర్తితా ॥

*(దేవీభాగవతం 11-19-19)*

శక్తి అనగా దేవీమంత్రమును జపించుటకు వేరొక కరమాల విధానము దేవీభాగవతమునందు వివరింపబడినది. ప్రక్కపుటలో రెండు చిత్రముల ద్వారా చూపబడినట్లుగా పైన వివరించిన రీతిగనే జపింపవలయును. 1వ సంఖ్య నుండి 10 వరకు జపింపవలెను. ఐతే దేవీమంత్రమును జపించినప్పుడు తర్జనీ అనగా చూపుడువ్రేలు యొక్క మొదటి రెండు గణుపులను మేరువుగా పరిగణించవలెను. అట్టి మేరువును దాటిపోకుండా చిత్రము (1) మరియు (2)లో చూపబడినట్లుగా పైన చెప్పిన పద్ధతిగనే అనులోమ విలోమముగా జపింపవలెను.

## శక్తిమంత్ర కరమాల



చిత్రము-1 చిత్రము-2

సర్వలిప్తు జపేద్దేవీం మాలాకామ్య జపేస్మృతా।
గాయత్రీ వేదమూలా స్యాద్ వేదః సర్వమగీయతే॥

సంధ్యోపాసనలో గాయత్రీ మంత్రమును కరమాలద్వారా జపించుటయే శ్రేష్ఠమని చెప్పబడినది. జపసంఖ్య పూర్తియైన పిమ్మట అంతమున 'ఓం' ప్రణవమును ఉచ్చరించి ఈ క్రింది మంత్రమును పఠించి, జపమాలకు నమస్కరించి జపమును ఈశ్వరునకు అర్పించవలయును.

ఓం త్వం మాలే సర్వదేవానాం ప్రీతిదా శుభదా భవ।
శివం కురుష్వ మే భద్రే యశోవీర్యం చ సర్వదా॥

### గాయత్రీ జప మాహాత్మ్యం

గోఘ్నః పితృఘ్నో మాతృఘ్నోభ్రూణహా గురుతల్పగః।
బ్రహ్మస్వక్షేత్రహారీ చ యశ్చవిప్రస్సురాం పిబేత్॥
స గాయత్ర్యా స్సహస్రేణ పూతో భవతి మానవః।
మానసం వాచికం పాపం విషయేంద్రియసంగజమ్॥
తత్కిల్బిషం నాశయతి త్రీణి జన్మాని మానవః।
గాయత్రీం యో నజానాతివృథా తస్య పరిశ్రమః॥
పఠేచ్చ చతురో వేదాన్ గాయత్రీం చైకతో జపేత్।
వేదానాం చావృతే స్తద్వద్గాయత్రీ జప ఉత్తమః॥

(దేవీభాగవతం 11-19-20-23)

॥ ఇతి జపవిధిః ॥